క్లుప్తంగా

బీమా సాయం అందజేత



బీమా సాయం అందిస్తున్న బ్యాంక్ అధికారులు

రాజానగరం: ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఎస్‌బీఐ కస్టమర్ కుటుంబానికి శుక్రవారం బీమా సాయాన్ని అందజేశారు. లాలాచెరువు ఎస్‌బీఐ బ్రాంచ్ ఖాతాదారు అయిన కుంచె పల్లవి అక్టోబరు 19న రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ నేపథ్యంలో ఆమె నామినీ అయిన తండ్రి ఏసురత్నానికి బ్యాంకు రీజినల్ మేనేజర్ టి.శ్రీనివాస్ చేతుల మీదుగా రూ.రెండు లక్షల చెక్కును అందజేశారు. అలాగే పీఎంఎస్‌బీవై పథకం కింద మంజూరైన మరో రూ.రెండు లక్షల చెక్కును కూడా అందించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ కె.కోటేశ్వరరావు, సేల్స్ మేనేజర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శేషవాహన సేవ

కడియం: దుళ్లలోని భూ సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శేష వాహన సేవ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు, భక్తబృందం పర్యవేక్షణలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. సహస్ర దీపాలంకరణ సేవ అనంతరం శేషవాహన సేవ ప్రారంభమైంది.

12న వివిధ వస్తువులకు వేలం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఏపీఎస్‌బీసీఎల్ డిపో పరిధిలోని వివిధ ప్రభుత్వ మద్యం షాపుల నుంచి తీసుకువచ్చిన వస్తువులకు ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. డిపో మేనేజర్ ఎంఏ ఖాదిర్ ఈ విషయాన్ని శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీఎస్‌బీసీఎల్ రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం హార్లిక్స్ ఫ్యాక్టరీ పక్కనే గల దాసరి సీతారామకృష్ణ గోడౌన్ వద్ద బహిరంగ వేలం జరుగుతుందన్నారు. 141 ఫ్రీజర్లు, 133 ఇన్వర్టర్ అండ్ బ్యాటరీలు, 143 క్యాష్‌చెస్ట్‌లు, 452 స్కానర్లు, 176 క్యాష్ కౌంటింగ్ మెషీన్లు, 105 కంప్యూటర్లు, 155 ప్రింటర్లు, 55 సామ్సంగ్ ట్యాబ్‌లు, 138 ఐరన్ ర్యాక్‌లు, 681 టేబుళ్లు, చైర్లు, ఫ్యాన్లు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు 94407 85620, 95059 68533, 99493 51052 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ విగ్రహ పునఃప్రతిష్ట

సీటీఆర్ఐ: స్థానిక నారాయణపురం గోపాల్ నగర్ పుంత రోడ్డులో కనకదుర్గమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. వీటిలో భాగంగా మూడు రోజులోగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11.26 గంటలకు శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారిని అలంకరించి, దర్శనానికి భక్తులకు అవకాశం ఇచ్చారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. హోమాలు ముగిసిన అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, బొమ్మూరు సీఐ కాశీ విశ్వనాథ్, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు మండ మోహన శర్మ, ఆలయ కమిటీ సభ్యులు మలిశెట్టి వాసు, వెంపా వెంకన్న, విన్నకోట తాతాజీ, పెంకే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వారాహీదేవి విగ్రహ ప్రతిష్ఠోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులో వారాహీదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. షణ్ముఖ పీఠాధిపతి స్కంద స్వామి పర్యవేక్షణలో పామర్తి బాబూరావు, విజయలక్ష్మి దంపతులు చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అడిషనల్ కమిషనర్‌గా రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా పీవీ రామలింగేశ్వర్ నియమితులయ్యారు. ఆయన అనంతపురం మున్సిపాలిటీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

నిప్పంటించుకుని మహిళ మృతి

కంబాలచెరువు: నగరంలోని మంగళవారపుపేటకు చెందిన మున్నీషా (45) నిప్పంటించుకుని మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్నీషా భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. అలాగే ఆమెకు పాప పుట్టి మృతి చెందింది. దీంతో ఒంటరిగా జీవిస్తున్న ఆమె మనస్తాపానికి గురై ఇంటిలో నిప్పటించుకుంది. స్థానికులు ఈ విషయాన్ని గమనించి ఆమె సోదరికి సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి చూసేసరికే మున్నిషా మృతి చెందింది. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

పెళ్లి బాజా.. మోగే వేళ

- ధవళగిరికి పెళ్లి కళ
- నేడు జనార్దనుడి కల్యాణం
- మధ్యాహ్నం 3.30 గంటలకు రథోత్సవం
- విస్తృత ఏర్పాట్లు



ధవళేశ్వరంలో కొలువైన లక్ష్మీజనార్దనస్వామి

ధవళేశ్వరం: ధవళేశ్వరం గ్రామంలోని ధవళగిరిపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీజనార్దనస్వామి కల్యాణానికి సర్వం సిద్ధమైంది. ఈ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామివారి కల్యాణం శనివారం రాత్రి 9.30 గంటలకు జరగనుంది. అంతకు ముందు తెల్లవారుజామున 3 గంటలకు విశేష అర్చనలు జరుగుతాయి. ఉదయం 11 గంటలకు రథాన్ని సంప్రోక్షణ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభమవుతుంది.

రథోత్సవానికి ప్రత్యేకత

గ్రామంలోని రథం వీధి నుంచి ప్రారంభమయ్యే రథోత్సవం స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్ వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు. దీనిలో భాగంగా సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణ, అంకురార్పణ, వాస్తుపూజ నిర్వహిస్తారు. కాగా.. స్వామివారి కల్యాణోత్సవాలు ఫిబ్రవరి 13వ తేదీ వరకూ జరుగుతాయి. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగ సురేష్ తెలిపారు.

ధవళగిరి ముస్తాబు

జనార్దనస్వామి కల్యాణానికి ధవళగిరి ముస్తాబైంది. కొండను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. రామపాదాల క్షేత్రంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. అక్కడి ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు పర్యవేక్షిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించారు.

రథోత్సవంలో పాల్గొన్న టంగుటూరి

ధవళేశ్వరం 1890లో జరిగిన రథోత్సవంలో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పాల్గొన్నారు. అప్పుడు ఆయన విద్యార్థిగా ఉన్నారు. ఈ విషయాన్ని మహాకవి చిలకమర్తి లక్ష్మీనరసింహపంతులు పద్యరూపంలో వర్ణించారు. దీనిని వివరిస్తూ ఆలయం దిగువన శిలాఫలకాన్ని సైతం ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు

ధవళేశ్వరం లక్ష్మీజనార్దనస్వామి కల్యాణోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామివారి కల్యాణం సందర్భంగా జరిగే తీర్థంలో మఫ్టీలో పోలీసులు ఉంటారని సీఐ టి.గణేష్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలిగించే ఆకతాయిలను ఉపేక్షించేది లేదన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాతీయ రహదారి మీదుగా వాహనాలను మళ్లిస్తామన్నారు.

‘నులి పురుగుల’ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ మణిజ్యోత్స్న, సిబ్బంది

కడియం: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీన పక్కాగా చేపట్టాలని కడియం ప్రభుత్వ వైద్యాధికారి ఎం.మణిజ్యోత్స్న అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. మణిజ్యోత్స్న మాట్లాడుతూ అంగన్‌వాడీలు, పాఠశాలల్లో ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సున్న విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తామన్నారు. వైద్య,ఆరోగ్య శాఖ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎంఈవో నాగేశ్వరరావు, ఏసీడీపీవో కనకవల్లి, ఆరోగ్య విస్తరణాధికారి రామకృష్ణ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

స్కూటీని ఢీకొన్న ట్రాలీ

- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు
- శుభ కార్యక్రమానికి వెళుతుండగా ఘటన

రాజానగరం: కుమార్తె ఇంట జరిగే ఒక శుభ కార్యక్రమానికి భర్తతో కలసి స్కూటీపై వెళుతున్న మహిళను మృత్యువు ట్రాలీ రూపంలో కబళించింది. ఈ సంఘటనలో భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై గైట్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. బొమ్మూరుకు చెందిన వాకలపూడి రాజేశ్వరి (65) భర్త వెంకటేశ్వరరావుతో కలిసి స్కూటీపై రాజానగరం మండలం పల్లకడియంలో ఉంటున్న కుమార్తె ఇంటికి పయనమైంది. గైట్ కళాశాల వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన ట్రాలీ ఢీ కొనడంతో తలకు బలమైన గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ నడుపుతున్న ఆమె భర్త వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలవ్వడంతో 108లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది.. రాజేశ్వరిని పరీక్షించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందింది. వీరి అబ్బాయి అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా, అమ్మాయి పల్ల కడియంలో ఉంటోంది. రాజానగరం ఎస్సై మనోహర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి



రమాబాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న దళిత నాయకులు

సీటీఆర్ఐ: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ఆయన భార్య రమాబాయి అందించిన తోడ్పాటు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం రమాదేవి అంబేడ్కర్ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. కోరుకొండ చిరంజీవి మాట్లాడుతూ అంబేడ్కర్ తన 8వ ఏటనే రమాబాయిని వివాహం చేసుకున్నారన్నారు. ఆయన చదువుకోవడానికి రమాబాయి ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. కార్యక్రమములో దళిత నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన రేడియో కెమిస్ట్ వర్క్‌షాప్



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త తపస్ దాస్, ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తదితరులు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో ఐదు రోజులుగా జరుగుతున్న రేడియో కెమిస్ట్ వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. రేడియో కెమిస్ట్రీ, రేడియో ఐసోటోప్‌ల అనువర్తనాలు అనే అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూక్లియర్ కెమిస్ట్ అండ్ అలైడ్ సైంటిస్ట్స్, ముంబై బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సంయుక్తంగా జరిపారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమానికి బార్క్ సీనియర్ సైంటిస్ట్, రేడియో ఫార్మాస్యూటికల్స్ విభాగం అధిపతి డాక్టర్ తపస్ దాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో రేడియో ఐసోటోప్‌ల అనువర్తనాల ప్రాధాన్యతను వివరించారు. ఆధునిక వైద్యంలో రేడియో ఐసోటోప్‌ల పాత్ర చాలా కీలమన్నారు. పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ, సింగిల్, ఫోటాన్ ఎమిషన్ కంప్యూటెడ్ టోమోగ్రఫీ, టార్గెటెడ్ రేడియోన్యూక్లైడ్ థెరపీ వంటి అధునాతన న్యూక్లియర్ మెడిసిన్ పద్ధతులపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా అంకాలజీ, కార్డియాలజీలో వ్యాధి నిర్ధారణ, చికిత్సను గణనీయంగా మెరుగుపరిచాయన్నారు. మరో సైంటిస్ట్ డాక్టర్ అతాను ఝా మాట్లాడుతూ పారిశ్రామిక అనువర్తనాల్లో రేడియో ఐసోటోప్‌లు, రేడియేషన్ టెక్నాలజీ ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. నాన్, డిస్ట్రక్టివ్ టెస్టింగ్, రేడియోగ్రఫీ, ప్రాసెస్ కంట్రోల్, మెటీరియల్ అనాలిసిస్, ఎన్విరాన్‌మెంటల్ మానిటరింగ్‌లో వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే, భౌతిక శాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి, ఆర్ట్స్ వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.గౌరీ నాయుడు, డాక్టర్ పీఎస్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సుందర్ నామినేషన్ ర్యాలీ



నామినేషన్ వేయడానికి వెళుతున్న సుందర్ తదితరులు

సీటీఆర్ఐ: ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు నామినేషన్ వేయడానికి జీవీ సుందర్ శుక్రవారం భారీ ర్యాలీతో ఏలూరు వెళ్లారు. కోరుకొండ రోడ్డులోని స్వగృహం నుంచి కార్యకర్తలు, అభిమానులతో కలిసి బయలుదేరారు. ప్రజా సమస్యలపై పోరాడి ప్రశ్నించేందుకే సుందర్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారని మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విశాఖపట్నం జోన్ ఇచ్చే వరకూ అవసరమైతే కూటమి ప్రభుత్వం.. ఎన్డీఏ నుంచి బయటికి వచ్చి పోరాటం చేయాలన్నారు. టిడ్కో ఇళ్లు ఇవ్వలేదని జగన్ విమర్శించిన చంద్రబాబు.. ఇప్పుడు 9 నెలలైనా ఇంకా టిడ్కో ఇళ్ల గురించి ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు.

బాబ్జీ పోతురాజుకు డాక్టరేట్



బాబ్జీ పోతురాజును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తదితరులు

కంబాలచెరువు: ప్రభుత్వ అటానమస్ కళాశాల, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, రాజకీయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బాబ్జీ పోతురాజు.. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్‌నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే శుక్రవారం తెలిపారు పాకిస్థాన్, సౌదీ అరేబియా సంబంధాలు, 1977, 2008 అనే అంశంపై ఆయన చేసిన పరిశోధన విశ్లేషణాత్మకంగా సాగిందన్నారు.

ఫెయిర్ వేజ్ అమలు చేయాలి

ప్రకాశం నగర్: ఓఎన్‌జీసీ కాంట్రాక్టు డ్రైవర్లకు సంస్థ ఇస్తున్న ఫెయిర్ వేజ్ అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఎన్‌జీసీ కేజీ బేసిన్ రాజమండ్రి అసెట్‌లో 350 మందికి పైగా డ్రైవర్లు కాంట్రాక్టు వర్కర్లుగా పనిచేస్తున్నారన్నారు.

లేబర్ డిపార్టుమెంట్ నిర్దేశించిన కనీస వేతనంతో పాటు అదనంగా 35 శాతం ఫెయిర్ వేజ్, రోజుకు రూ.50, సెలవు జీతం, బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. దీనికి అంగీకరించిన వారికే టెండర్లు వేసేందుకు అనుమతి ఉందన్నారు. కొత్త కాంట్రాక్టర్ రెండేళ్లుగా తక్కువ జీతం ఇస్తూ డ్రైవర్ల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.

వికాస్ సంస్థ సేవలు అభినందనీయం



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

సీటీఆర్ఐ: వృద్ధులకు ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్న వికాస్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని, ఈ సేవలు నిరంతరం కొనసాగాలని నగర ప్రముఖుడు తమనంపూడి రామిరెడ్డి ఆకాంక్షించారు. వికాస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ యార్లగడ్డ ప్రభాకర్ ఆధ్వర్యంలో వంద మంది వృద్ధులకు ప్రతి నెలా ఏడో తేదీన పింఛన్లు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా శుక్రవారం వీఎల్ పురం పార్కులో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామిరెడ్డి మాట్లాడుతూ వికాస్ సంస్థ తన వంతు సామాజిక బాధ్యతగా 11 ఏళ్లుగా వృద్ధులకు పింఛన్లు అందించడం అభినందనీయమన్నారు. కొందరికి నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో గోదావరి స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుబ్బల వెంకట రమణ, దుళ్ల రవి, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

సీటీఆర్ఐ: కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్ వరాహలక్ష్మి నృసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న చందన యాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి నిజరూప దర్శనం జరిగింది. మాఘ దశమి రోజు కావడంతో నిజరూప దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 6 నుంచి వేలాదిగా ప్రజలు తరలి రావడంతో క్వారీ మార్కెట్ రైతు బజారు వరకూ క్యూలైన్ పెరిగింది. భక్తులు గంటల తరబడి నిలబడి, స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, కాలెపు నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు అవసరాల కిరణ్ స్వామి.. తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, ఆరాధన, చందనోత్తరణ, సువర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. ఉదయం 6 నుంచి స్వామి నిజరూప దర్శనం మొదలైంది. శనివారం ఉదయం 11 గంటలకు శ్రీవారి చక్రస్నానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గడ్డివామి కాలిపోయిన ప్రాంతంలో రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్య కిశోర్

కడియం: నేరగాళ్లు ఎప్పటికప్పుడు సరికొత్త విధానాలు అవలంబిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మండలం డీఎస్పీ భవ్య కిశోర్ అన్నారు. కడియం ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్సై ఎం.దుర్గాప్రసాద్‌తో కలిసి శుక్రవారం దుళ్లలోని చిట్టూరి వెంకన్న చౌదరి పొలంలో గడ్డివామి దగ్ధమైన ప్రదేశాన్ని పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామంలో నేరాల నివారణకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ నేరాల్లో యువత ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తమ పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి ఉంచాలన్నారు. మోసపుచ్చే ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

జగన్ దృష్టికి ముస్లింల సమస్యలు



హబీబుల్లాఖాన్‌ను సత్కరిస్తున్న ముస్లిం నాయకులు

సీటీఆర్ఐ: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ముస్లింల సమస్యలు తీసుకువెళతానని వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబుల్లాఖాన్ అన్నారు. ఆజాద్ చౌక్‌లోని లాబాబీన్ లైన్ మసీదు ప్రాంగణంలో శుక్రవారం ఆయనను రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌కు సంబంధించిన వైఎస్సార్ సీపీ ముస్లిం నాయకులు, ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇచ్చిన మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కూటమి పాలనలో పేదల సంక్షేమం శూన్యం



సీతారామపురంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎన్నికల హామీలు ఏమయ్యాయి!
- మోసపోయిన ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా ‘నా కార్యకర్తలు – నా కుటుంబం’

రాజానగరం: కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ప్రజలపై ఎన్నో వరాలు, హామీలు కురిపించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోయారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కూటమి పాలనలో పేదలకు జరుగుతున్న మేలు శూన్యమన్నారు. కూటమి నాయకుల హామీలను నమ్మి మోసపోయిన పేదలకు అండగా వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు. దీనిలో భాగంగా రూపొందించిన ‘నా కార్యకర్తలు – నా కుటుంబం’ కార్యక్రమాన్ని రాజానగరం మండలం సీతారామపురం నుంచి శుక్రవారం ఆయన ప్రారంభించారు. పార్టీ శ్రేణులతో సమావేశమై, వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అండగా నిలబడి అన్యాయాన్ని ఎదురించడంలో సైనికుల్లా పనిచేయాలన్నారు.

సంపదను దోపిడీ చేస్తున్నారు

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రాగానే సంపద సృష్టిస్తామని చంద్రబాబు చెప్పారని, కానీ ఇప్పుడు రాష్ట్రంలోని సంపదనంతా దోపిడీ చేసేస్తున్నారని ఆరోపించారు. గోదావరిలో ఇసుక, చెరువు, కొండలలో మట్టిని తోడేస్తూ, తోడేళ్ల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేశారని, సూపర్ సిక్స్ పేరుతో మద్యం బ్రాండ్ తీసుకువచ్చారన్నారు. బాబూ ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారంటీ అనే మాటను పక్కన పెట్టారన్నారు. ప్రజలపై రకరకాల పన్నుల భారం వేసి, బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీగా చేశారన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలకు అండగా నిలవడటమే జక్కంపూడి కుటుంబం నైజమన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెద వెంకన్న, కర్రి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు మేడా గురుదత్త ప్రసాద్, అడబాల చినబాబు, అడపా కనకరాజు, మందారపు వీర్రాజు, గండి నానిబాబు, కోలపాటి వెంకన్న, కొండపల్లి దుర్గారావు, కంటే వినయ్‌తేజ, బాబ్జీ, బద్రి, జగదీష్, తేజోనాయుడు, శ్రీను, సాయి పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

కంబాలచెరువు: అపార్టుమెంట్‌పై వాకింగ్ చేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. కొంతమూరు రాజరాజేశ్వరిగుడి వీధిలోని ఐక్య అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఐ.సురేష్ (55) శుక్రవారం ఉదయం అపార్ట్‌మెంట్‌పైకి వెళ్లి వాకింగ్ చేస్తున్నాడు. అయితే ఐదో అంతస్తు నుంచి కిందకు పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అప్పటికే అతడు మృతి చెందాడు. రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి దగ్ధంపై కేసు

కంబాలచెరువు: తన ఇంటికి ఎవరో కావాలని నిప్పుపెట్టి, దహనం చేశారని ఆదెమ్మదిబ్బకు చెందిన కందుకూరి నారాయణమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. నారాయణమ్మ కుటుంబం కొద్దిరోజుల క్రితం వేరే ప్రాంతానికి వెళ్లింది. గురువారం అర్ధరాత్రి ఇంటి లోపల మంటలు వ్యాపించినట్లు స్థానికుల ద్వారా విషయం తెలిసి ఇక్కడకు వచ్చింది. ఇంటిలో సామగ్రి కాలిపోవడంతో ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

కంబాలచెరువు: సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు జిల్లా పాఠశాల విద్యాధికారి కంది వాసుదేవరావు సూచించారు. దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఐడీబీఐ రాజమహేంద్రవరం బ్రాంచ్ సౌజన్యంతో సమకూర్చిన 17 ఐరన్ బెంచీలను శుక్రవారం పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ యాజమాన్యం చేస్తున్న సేవా కార్యక్రమాలను వాసుదేవరావు అభినందించారు. ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ నాళం అనిల్ కుమార్ మాట్లాడుతూ తమ బ్యాంక్ జాతీయ స్థాయిలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఐడీబీఐ ఆత్రేయపురం బ్రాంచ్ మేనేజర్ ప్రణయ్‌కుమార్, స్థానిక బ్రాంచ్ సిబ్బంది జయకర్, లంక సోనీ, చాందిని, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముంబై సమ్మిట్‌కు డాక్టర్ శ్రీనివాస్



ఈఆర్‌ఎస్ సమ్మిట్‌కు హాజరైన డాక్టర్ గూడూరి శ్రీనివాస్

కంబాలచెరువు: ముంబైలో శుక్రవారం జరిగిన ఈఆర్‌ఎస్ ఇండియా సమ్మిట్‌కు రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ ఊపిరితిత్తుల వైద్యులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయతో పాటు నగరానికి చెందిన మరో వైద్యుడు సోమనాథ్ దాస్ ఉన్నారు. ఇండియన్ చెస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఊపిరితిత్తుల విభాగంపై వీరు ప్రసంగించారు.